క్లుప్తంగా

బిల్కిస్ బానో కేసులో సుప్రీం తీర్పు హర్షణీయం

మార్కాపురం: మత సామరస్యాన్ని కాపాడుతూ సుప్రీం కోర్టు తీర్పునివ్వడం హర్షణీయమని ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, న్యాయవాది సయ్యద్ జావీద్ అన్వర్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2002లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లలో అత్యాచారానికి గురైన బిల్కిస్ బానో కేసులో నిందితులను రెండు వారాల్లో లొంగిపోవాలని తీర్పునివ్వడంతో న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరిగిందన్నారు.

ఆలయాల్లో మార్గశిర మాస పూజలు

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయం, కొనకనమిట్ల రామదూతక్షేత్రం, ఎదురాళ్లపాడు సంగమేశ్వరాలయంలో సోమవారం మార్గశిర మాస పూజలు నిర్వహించారు. గోవిందా గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గోగినేనివారిపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, ఎంఈఓలు

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని ఏలూరు, ఉప్పలపాడు, గోగినేనివారిపాలెం, తలమళ్ల, కాటూరివారిపాలెం పోలింగ్ కేంద్రాలను సోమవారం పొదిలి ఎస్సై వెంకట సైదులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో కిటికీలు, మంచినీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, ర్యాంపులు మొదలగు వసతులును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు. రాయవరం గ్రామంలో బత్తుల అడివయ్య వద్ద 8 బాటిళ్లు, చల్లా వీరమ్మ వద్ద 8 బాటిళ్లు, పాడతరపు నారాయణ వద్ద 7 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్సై కోరారు.

కంభం: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐపులి రాజేష్ తెలిపారు. సోమవారం ఉదయం మండలంలోని చిన్నకంభంలో ఓ వ్యక్తి అక్రమంగా 30 మద్యం సీసాలు తీసుకెళ్తుండగా అదుపులోకి తీసుకున్నామని సదరు వ్యక్తిని కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గౌతమి కళాశాలలో మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

దొనకొండ: స్థానిక గౌతమి డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 11వ తేదీన కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ నరసరావుపేట ఆధ్వర్యంలో మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు టెస్ట్‌లకు అర్హులని, పాసైన వారికి 7 సంవత్సరాలు మెరిట్ స్కాలర్‌షిప్ వర్తిస్తుందని తెలిపారు. కురిచేడు, దొనకొండ మండలాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాస్టర్ల సంఘం నాయకులు వీరే

యర్రగొండపాలెం: నియోజకవర్గ పాస్టర్ల సంఘ నూతన కార్యవర్గాన్ని సోమవారం స్థానిక క్రీస్తు సంఘంలో ప్రకటించారు. ఆ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.సుందరరాజు(యర్రగొండపాలెం), గౌరవ అధ్యక్షుడిగా ఎంఐ ప్రసాదరావు(యర్రగొండపాలెం), ఉపాధ్యక్షుడిగా రావూరి ఆనందరావు(పుల్లలచెరువు), కార్యదర్శిగా చాట్ల గంగయ్య (పెద్దదోర్నాల), సహాయ కార్యదర్శిగా కొండెపోగు సామేల్ (త్రిపురాంతకం), కోశాధికారిగా బచ్చలకూరి సుందరయ్య (పెద్దారవీడు), సలహాదారులుగా తంగిరాల యాకోబు (పెద్దదోర్నాల), వీరదాసు ఆశీర్వాదం (పుల్లలచెరువు), కార్యవర్గ సభ్యులుగా సింగా ఏసన్న(పెద్దదోర్నాల), బందెల కృపారావు (పుల్లలచెరువు), కోట ఇస్రాయిల్ (పుల్లలచెరువు), ఎనిబెర నాసరయ్య (పెద్దారవీడు), మాకం జాన్‌రాజు (త్రిపురాంతకం), చాట్ల కోటయ్య(యర్రగొండపాలెం)లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

అయోధ్య అక్షతల వితరణ

త్రిపురాంతకం: అయోధ్య శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఇంటింటికీ అక్షతల కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. త్రిపురాంతకం శ్రీ సీతారామస్వామి ఆలయం నుంచి అక్షతల వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి త్రిపురాంతకంలోని అన్ని ప్రాంతాల గృహాలకు అక్షతలు, శ్రీరామాలయం నమూన, ఆహ్వాన పత్రికను అందజేసినట్లు వీహెచ్‌పీ ప్రముఖులు ఎస్.వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని సీహెచ్ గురుస్వామి, కేవీ రమణారెడ్డి, గురునాథం, విశ్వం, రమేష్, ఎస్ఎస్ఎఫ్ ప్రముఖులు దుర్గారెడ్డి, నరసింహారావు, చల్లా రమణారెడ్డి, కృష్ణ పర్యవేక్షించారు.

పింఛన్‌దారుల్లో రెట్టించిన ఉత్సాహం



కొనకనమిట్లలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

కొనకనమిట్ల: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ జగనన్న ముఖ్యమంత్రి కాగానే అవ్వాతాతల పింఛను మొత్తాన్ని ఏటా పెంచుతూ రూ.3 వేలు చేశారని వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు అక్కిదాసరి ఏడుకొండలు పేర్కొన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మండలంలో నూతనంగా 100 మందికి మంజూరైన పింఛన్లు అందజేశారు. లబ్ధిదారులు సంతోషాన్ని వెలిబుచ్చి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు పాతకోట వెంకటరెడ్డి, చిరుగూరి కోటేశ్వరరావు, పాలూరి వెంకటేశ్వర్లు, పిన్నిక పిచ్చయ్య, సిద్దానబి, గోనుగుంట్ల శ్రీనివాసులు, గాడి కోనేటిరెడ్డి, సచివాలయ కార్యదర్శులు, ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. వలంటీర్లు, కౌన్సిలర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి 3 వేల రూపాయల పింఛను అందిస్తున్నారు. సోమవారం పింఛన్ల పంపిణీలో ఆయా వార్డుల కౌన్సిలర్లు దొడ్డ భాగ్యలక్ష్మి, హర్షిత, గుంటక వనజాక్షి, నాగ అరుణ, డాక్టర్ కనకదుర్గ, రోజ్‌లిడియా, అమీరుల్లాఖాన్, ఉత్తమ్ కుమార్, కరీముల్లా, షెక్షావలి, నగేష్ పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 6,289 మందికి పింఛన్లు అందజేస్తున్నారు. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 2,927, వితంతు పింఛన్లు 2,090, దివ్యాంగుల పింఛన్లు 928, ఒంటరి మహిళ పింఛన్లు 223, వైఎస్సార్ అభయహస్తం 25, చర్మకారుల పింఛన్లు 15, డప్పు కళాకారులు 13, చేనేతలు 9, మత్స్యకారులు 10, ట్రాన్స్‌జెండర్లు 3, ఆర్టిస్ట్ పింఛన్లు 1, సైనిక వెల్ఫేర్ పింఛను 1, హెల్త్ పింఛన్లు 44 ఉన్నాయి. లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.1.90 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

పింఛన్ల పంపిణీ

రాచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ షేక్ ఖాశింబీ చేతుల మీదుగా నూతనంగా మంజూరైన పింఛన్‌లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగి ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు మంజూరు చేయడమే కాకుండా వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా గ్రామ వలంటీర్ల ద్వారా పింఛన్‌లు మంజూరు చేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఇలాంటి పథకాలు, ప్రభుత్వం కావాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని తెలిపారు. మండలంలో 5,329 పింఛన్‌లు కాగా ఇటీవల నూతనంగా మంజూరైన 59 పింఛన్‌లను పంపిణీ చేశారు. ఎంపీడీవో కె.కవితా చౌదరి, రాచర్ల, గౌతవరం, అనుమలవీడు సర్పంచ్‌లు సగినాల రాయలమ్మ, ఎం.లక్ష్మీదేవి, పల్నాటి లతీఫ్, ఎంఈవోలు గిరిధర్‌శర్మ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మార్కాపురంలో పింఛన్ అందిస్తున్న కౌన్సిలర్లు భాగ్యలక్ష్మి, అమీరుల్లాఖాన్



తర్లుపాడులో పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

తర్లుపాడు: అవ్వా తాతల మోములో చిరునవ్వులు చిందించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛను సొమ్మును రూ.3 వేలకు పెంచారని ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన పింఛను పెంపు మహోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో 4,764 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.1.42 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో నూతనంగా 67 మందికి పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహులు, మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ వరాలు, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, సొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జి ఈఓఆర్డీ బాలకృష్ణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు సమ్మె విరమించాలి

● కమిషనర్ రవీంద్ర విజ్ఞప్తి



కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

మార్కాపురం టౌన్: మున్సిపల్ కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన దృష్ట్యా సమ్మె విరమించి పనులకు హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర విజ్ఞప్తి చేశారు. సోమవారం మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్న దీక్షా శిబిరానికి వచ్చిన కమిషనర్ మాట్లాడుతూ.. రూ.21 వేల వేతనం ఇచ్చేందుకు ప్రభుత్వం ఒప్పుకుందని, ఇతర డిమాండ్లను కూడా నెరవేర్చేందుకు సిద్ధంగా ఉందని, సమ్మె విరమించి విధుల్లో చేరాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కొన్ని మున్సిపాలిటీల్లో కార్మికులు స్వచ్ఛందంగా విధుల్లో చేరినట్లు చెప్పారు. అనంతరం ఏఐటీయూసీ నాయకులు షేక్ ఖాశీం, హరిబాబు, రాజు, వెంకటయ్య తదితరులతో కమిషనర్ చర్చించారు.

పొదిలిలో విధుల్లో చేరిన పారిశుధ్య కార్మికులు



పొదిలిలో కమిషనర్‌కు లెటర్ అందజేస్తున్న కార్మికులు

పొదిలి: సమస్యల పరిష్కారం కోసం గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న పొదిలి నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు విరమించారు. సోమవారం 25 మంది కార్మికులు విధుల్లో చేరారు. కమిషనర్‌తో జరిపిన చర్చలు ఫలించడంతో తాము విధుల్లో చేరుతున్నామని పేర్కొంటూ లెటర్ అందించారు. మంగళవారం మరి కొంత మంది విధుల్లో చేరతారని, వారి సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తానని కమిషనర్ డానియేల్ జోషెఫ్ తెలిపారు.

మస్తాన్ కుటుంబానికి అండగా ఉంటాం



నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: వైఎస్సార్ సీపీ నాయకుడు మస్తాన్ కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శివరాజనగర్‌లోని షేక్ మస్తాన్‌వలి భార్య ఆదిమహాలక్ష్మి సోమవారం మృతి చెందింది. శివప్రసాద్‌రెడ్డి ఆమె మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మస్తాన్ కుటుంబాన్ని ఓదార్చారు. వారికి అన్నీ విధాలా అండగా ఉంటామన్నారు. ఆదిమహాలక్ష్మి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, రహమ్‌తుల్లా, ఎర్ర మేస్త్రి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సచివాలయ సేవలపై అవగాహన పెంచుకోవాలి

ముండ్లమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సచివాలయ వ్యవస్థ, వాటి సేవలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరరావు తెలిపారు. మండలంలోని పసుపుగల్లు సచివాలయాన్ని క్షేత్ర పర్యటనలో భాగంగా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో అందుతున్న 11 రకాల సేవలపై సంబంధిత సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను ప్రస్తుతం సచివాలయ సిబ్బంది అందించనున్నట్లు వివరించారు. సకాలంలో అర్హులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో సచివాలయ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. బాధ్యతగా పని చేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి జవాబుదారీతనంగా సచివాలయం సేవలు ఉన్నాయని విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు కె.రాముడు, నరసింహారెడ్డి ఉన్నారు.

వికలాంగులకు వీల్‌ఛైర్స్ పంపిణీ



వికలాంగులకు వీల్‌ఛైర్స్ పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పుల్లలచెరువు: ప్రార్థించే పెదవుల కన్నా ఇతరులకు సాయం చేసే చేతులు మిన్న అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇండియా క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వికలాంగులకు వీల్‌ఛైర్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి మంచి పనులు చేయడం ఎంతో అభినందనీయం అని, నలుగురికి సాయం చేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. సంస్థ ఫౌండర్ జేసీ పాల్ మాట్లాడుతూ తమ సంస్థ తరఫున వికలాంగులకు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్‌లో భారీ ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఎంపీపీ కందుల వెంకటయ్య, మండల ఉపాధ్యక్షుడు ఎల్. రాములు, నాయుడు పాలెం, చాపలమడుగు సర్పంచ్ కోటిరెడ్డి, సత్యానారాయణరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రఘు, నిర్వాహకులు గాలెయ్య, దేవసహాయం, పాస్టర్లు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా టీషర్టుల పంపిణీ

రాచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రాకు సంబంధించిన ఆడుదాం ఆంధ్రా టీ షర్టులను ఎంఈవోలు వారణాసి గిరిధర్‌శర్మ, అల్లూరి శివ కోటేశ్వరరావు చేతులు మీదుగా సోమవారం పంపిణీ చేశారు. 10వ తేదీన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మోడల్ స్కూల్ ఆటల స్థలంలో క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన టీ షర్టులను పంపిణీ చేసినట్లు తెలిపారు. రాచర్ల, గౌతవరం, అనుమలవీడు సర్పంచ్‌లు సగినాల రాయలమ్మ, ఎం.లక్ష్మీదేవి, పల్నాటి లతీఫ్ పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

త్రిపురాంతకం: అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందిస్తోందని, వాటిని సక్రమంగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పథకాలను అందించాలని సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ అర్హులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఎంపీడీఓ సాంబశివరావు మాట్లాడుతూ అధికారులు సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఎంఈఓ టి. రాజశేఖర రెడ్డి, ఏపీఓ సుజాత, ఏపీఎం కృపమ్మ, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, పశువైద్యాధికారి నాగుల్‌మీరా, ఎన్ఎస్‌పీ ఏఈ శివన్నారాయణ, వీఆర్ఓ శివలింగయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు రిబకమ్మ పాల్గొన్నారు.

మహిళా రైతు సంఘాలకు రూ.3 కోట్ల రుణాలు



మేనేజర్‌తో మాట్లాడుతున్న ఏఓ

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు రూ.3 కోట్ల బ్యాంకు రుణాలు మంజూరు చేసినట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. స్థానిక కెనరా బ్యాంకులో 70 మహిళా రైతు సంఘాలకు రూ.3 కోట్ల బ్యాంకు రుణాలను బ్యాంకు మేనేజర్ ధర్మసాయి చేతుల మీదుగా సోమవారం మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల్లో 150 మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అందులో అర్హతగల 70 సంఘాలకు మూడు కోట్ల ఎనిమిది లక్షల రుణాలను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో సక్రమంగా చెల్లించి వడ్డీ రాయితీ పొందాలన్నారు. ఇంకా ఆశక్తి ఉన్న మహిళా రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే వాళ్లకి కూడా రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు



గాయపడిన జడ్సన్

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలైన సంఘటన మండల కేంద్రం మోడల్ స్కూల్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగింది. వివరాలకు.. మోడల్ స్కూల్లో ఇంటర్ చదువుతున్న రంగశ్వేత అనే విద్యార్థినికి పాఠశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో తన తండ్రితో కలిసి మోటారు సైకిల్‌పై గిద్దలూరు మండలం బయనపల్లె గ్రామానికి బయల్దేరింది. అదే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీకొట్టడంతో రంగశ్వేతకు గాయాలయ్యాయి. ఆమెను ప్రత్యేక వాహనంలో గిద్దలూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

కురిచేడు: వేగంగా వెళ్తున్న పాలవ్యాన్ తగిలి విద్యార్థికి గాయాలైన సంఘటన స్థానిక ఎస్ఎస్‌పీ కాలనీలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల వద్ద సోమవారం జరిగింది. వివరాలు.. త్రిపురాంతకం మండలం అన్నసముద్రం గ్రామానికి చెందిన గాడికొయ్య జడ్సన్ స్థానిక అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావటంతో విద్యార్థులు వారి గ్రామాలకు వెళ్లే హడావుడిలో పడ్డారు. పాఠశాలల వద్ద స్పీడు బ్రేకరు లేకపోవటంతో వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ క్రమంలో ఆ సమయంలో దొడ్ల డెయిరీ పాలవ్యాను వినుకొండకు వేగంగా వెళ్తూ రోడ్డు దాటుతున్న విద్యార్థిని ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండ తరలించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



మార్కాపురం: ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ ఫాతిమా, హెచ్‌ఎం



కొమరోలు: విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు

మార్కాపురం టౌన్: పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను సోమవారం 12వ బ్లాక్ కౌన్సిలర్ షేక్ ఫాతిమా షేక్షా అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు, సందేహాలు నివృత్తి చేసుకునేందుకు ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేస్తోందని తెలిపారు. ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ కరీముల్లా, హెచ్‌ఎం హేమలత, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

కొమరోలు: విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు తెలిపారు. మండలంలోని అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటనాయుడు విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తోందని, ఆన్‌లైన్ పాఠాలను బోధిస్తోందని తెలిపారు. ట్యాబ్‌లను విద్యార్థులు వినియోగించుకుని 3 సంవత్సరాలపాటు చక్కగా చదవాలని తెలిపారు. అల్లినగరం ఎంపీటీసీ జాజం వెంకటరమణ, ఎంఈఓలు కావడి వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, ప్రధానోపాధ్యాయులు గురుస్వామి పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



పొదిలిలో ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



బేస్తవారిపేట: జెడ్పీ హైస్కూల్లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



కురిచేడు: ప్రథమ విజేతగా నిలిచిన ముగ్గు



వై.పాలెం:విద్యార్థులతో ఎంఈవో ఆంజనేయులు

పొదిలి: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సంక్రాంతి ముందస్తు సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు పీవీ కొండారెడ్డి సమకూర్చిన బహుమతులను, ఎంఈఓ-2 నాగలక్ష్మి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తారావాణి, హెచ్‌ఎం కరీమునాబీబీ, ఉపాధ్యాయులు బీవీ రెడ్డి, ఓబులరెడ్డి, శైలజ, ప్రమీల, పద్మజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: మండలంలోని కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులకు ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ, సంప్రదాయ వేషధారణల పోటీలతో పండగ వాతావరణాన్ని కల్పించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. హెచ్‌ఎం మంతు రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురిచేడు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రంగసాయి, సిబ్బంది సోమవారం ముగ్గుల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, విద్యార్థినులు పోటీల్లో పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేసి రంగులు అద్దారు. వాటిల్లో ఉత్తమ వాటికి బహుమతులను ప్రధానోపాధ్యాయులు రంగసాయి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అందజేసి మిఠాయిలు పంచిపెట్టారు.

యర్రగొండపాలెం: మండలంలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో సోమవారం జరిగిన ముందస్తు సంక్రాతి వేడుకలు అంబరాన్నిఅంటాయి. వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురిజేపల్లిలోని మండల పరిషత్ పాఠశాలల్లో జరిపిన సంక్రాంతి సంబరాలు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేవిధంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ముగ్గులు వేశారు. వివిధ వేషాధారణలో విద్యార్థులు సందడి చేశారు. ఎంఈవో పి.ఆంజనేయులు మాట్లాడుతూ ఈ కార్యక్రమాలతో ప్రతి ఒక్కరికి మన సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, ఎంఈవో-2 మల్లునాయక్, పీసీ చైర్మన్ రాజశేఖరరెడ్డి, సర్పంచ్ అరుణకుమారి, హెచ్‌ఎంలు మంత్రూనాయక్, జాకబ్ పాల్గొన్నారు.

దొనకొండలో‘జన్ భాగీధర్’



దొనకొండ: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



పెద్దారవీడు: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సర్పంచ్ రమేష్

దొనకొండ: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు జన్ భాగీధర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ వి.వసంత రావునాయక్, ఎంఈఓ ఎస్.సాంబశివరావు, ఏఓ దావూద్, ప్రధానోపాధ్యాయులు వీవీ రామాంజనేయులు, కార్యదర్శి పి.కృష్ణమూర్తి, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దారవీడు: మండల పరిధిలోని సుంకేసుల పంచాయతీ కార్యదర్శి ఆర్.పెద్దిరాజు ఆధ్వర్యంలో జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం సర్పంచ్ గుండెపోగు రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు, విద్యార్థులు పురవీధుల్లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ ప్రదాత, దేశపాలన మార్గదర్శకాల విధాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. హెచ్‌ఎం పి.కృష్ణప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కమిటీ సభ్యులు గుర్రం ముత్యాలయ్య, నాయకులు ఆవుల నాగిరెడ్డి, ఎఫ్ఏ సానికొమ్ము మల్లారెడ్డి, సచివాలయ ఉద్యోగులు వి.పురుషోత్తం, శ్రీనునాయక్, టి.మౌనిక, పీఈటీ శినాగరాజు పాల్గొన్నారు.